క్లుప్తంగా

పెండింగ్ డీఏలు చెల్లించాలి



శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నాలుగు విడుతల కరువు భత్యం బకాయి ఉందని తెలిపారు. వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో పదివేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయాలని, లెఫ్ట్ ఓవర్ వేకన్సీల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, పీఆర్సీని అమలు చేయాలన్నారు. విద్యార్థులకు సరిపడా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీరా రాజారాం, జిల్లా కార్యదర్శి చంద్రయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు



ఎల్కతుర్తి : కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ 65వ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో నాయకులు కేక్‌కట్ చేసి వినోద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రయాణికులకు స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ స్వప్న, మాజీ వైస్ ఎంపీపీ నగేష్, సింగిల్‌విండో చైర్మన్ రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ శేషగిరి, నాయకులు స్వామి, మహేందర్, మహేందర్, వినయ్, చిట్టిగౌడ్, ప్రతాప్‌రెడ్డి, మదన్‌మోహన్ రావు, సాంబమూర్తి, వెంకటేశ్‌యాదవ్, రాజ్ కుమార్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



దుగ్గొండి : మండలంలోని మందపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భక్తురాలు అంబరగొండ రాజమాత సోమవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, అభ్యసన సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాజమాత దాతృత్వాన్ని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చందుపట్ల లక్ష్మీ, అప్పాల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి సాయం

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటకు చెందిన కూనూరు సతీశ్‌కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా ఆయన పని చేస్తున్న కోరమండల్ అగ్రిసైన్స్ కంపెనీ ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం రూ.5 వేల సాయం అందజేశారు. తొలుత సతీశ్‌ను పరామర్శించారు. కంపెనీ బాధ్యులు సతీశ్‌ను ఆర్థికంగా ఆదుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బేతి నగేశ్ కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఓదెలు, సుభాష్, తోటకూరి శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

బియ్యం అందజేత

సంగెం : మండలంలోని మొండ్రాయికి చెందిన ఏడాకుల లింగమూర్తి ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేశ్ సోమవారం 50 కేజీల బియ్యం సాయంగా అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పరికి యాకయ్య, రాజు, ఏలియా, రాములు, దయాకర్, కిషన్, చాతాళ్ల సారయ్య, మురళి, చంద్రమౌళి, వేల్పుల కుమారస్వామి పాల్గొన్నారు.

పరామర్శ

దుగ్గొండి : మండలంలోని శివాజీనగర్‌కు చెందిన బుస్సారి కార్తీక్ సుమారు 10 రోజుల క్రితం మృతి చెందగా అతడి తండ్రి వసంతరావును నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.4 వేల నగదు, 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మట్ట రాజు, ఒలిగె నర్సింగరావు, దంజ్యానాయక్, జయరాంనాయక్, భరత్‌రెడ్డి, శివాజీ, నాగరాజు, రవివర్మ, ప్రకాశ్, రామారావు, శ్రీనివాస్, రామారావు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే..

- అధ్వానంగా వెంకటేశ్వర్లపల్లి రోడ్డు
- కొద్దిపాటి వర్షానికే బురదమయం
- కాలినడక కూడా కష్టమే..



వెంకటేశ్వర్లపల్లి గ్రామ ప్రధాన కూడలిలో బురదరోడ్డు



వెంకటేశ్వర్లపల్లిలో బురదమయంగా మారిన ఓ వీధికి వెళ్లే దారి

నడికూడ: ఆ గ్రామాన్ని ఎటువైపు నుంచి చూసినా బురదమయమైన దారులే స్వాగతం పలుకుతాయి. అభివృద్ధి అనే పదానికి ఆమడ దూరంలో ఉంటుందని ఆ పల్లె.. మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్లన్నీ బురదమయంగా మరి కాలినడక కూడా కష్టతరంగా మారింది. ఈ రోడ్లపై నడవాలంటే ఎక్కడ జారిపడతామని బాటసారులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. వెంకటేశ్వర్లపల్లి నుంచి పరకాల, మరిపల్లిగూడం, నర్సింగాపూర్‌కు వెళ్లే రోడ్లన్నీ సింగల్ రోడ్లు కాగా కొన్నిచోట్ల కంకర తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. దానికితోడు తేలికపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా పెద్దగుంతలు ఉండడంతో రాకపోకలు కొనసాగించాలంటే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో అదుపుతప్పి గుంతల్లో పడి గాయాల పాలయ్యారని పలువురు తెలిపారు. రోడ్లన్నీ బురద, గుంతలు ఉండటంతో బస్సు డ్రైవర్లు కూడా ఇబ్బందుల నడుమ రకపోకలు సాగిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు జరగలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పోరాట యోధుడు దాశరథి



దాశరథి చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు

హన్మకొండ (పరకాల) : 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప కవి, తెలంగాణ పోరాట యోధుడు దాశరథి అని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షుడు మోరె అశోక్ అధ్యక్షతన దాశరథి జయంతి సోమవారం జరిగింది. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు నివాళులర్పించారు. దాశరథి ఎంతో మంది కవులకు ఆదర్శమన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా అనేక సార్లు జైలుకు వెళ్లిన దాశరథి ఎంతో మంది ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

రాజకీయ రిజర్వేషన్ సాధనే ధ్యేయం



నిరసన తెలుపుతున్న రాజేశ్, నాయకులు

వర్ధన్నపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ సాధించడమే ధ్యేయంగా పోరాడతామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ స్పష్టం చేశారు. మండలంలోని ఇల్లందలో సోమవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి మండల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షరీఫ్ అధ్యక్షత వహించగా రాజేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వికలాంగుల హక్కులను, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలును విస్మరిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని, వికలాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కళ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నాయకులు శ్రీనివాస్, నర్సింహులు, సుమతి, బాలకృష్ణ, మత్స్యగిరి, షరూజ్, ఆకారపు వెంకన్న, వంటిపాక ముత్తయ్య, రమేశ్, ఆరీఫ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న నిఖిల్

నర్సంపేట : విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం వరంగల్ విభాగ్ కన్వీనర్ అయిత నిఖిల్ తెలిపారు. పట్టణంలో సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం 1949 జూలై 9న ఢిల్లీ యూనివర్సిటీలో ఐదుగురు విద్యార్థులతో మొదలై ప్రస్తుతం 60 లక్షల సభ్యత్వంతో ముందుకు సాగుతోందని చెప్పారు. అనంతరం నగర కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రాకం రాకేశ్ ఎన్నికయ్యారు. తదనంతరం రాకేశ్ మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం దిశగా చైతన్యయుత పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ తిప్పారపు గణేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఐనవోలు : నూతనంగా పట్టాపాస్‌బుక్కులు పొందిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ అడప కవిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 28–2024 వరకు పట్టాపాస్ బుక్‌లు వచ్చి రైతుబీమాకు దరఖాస్తు చేసుకోని వారు ఆగస్టు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా గతంలో బీమా నమోదు చేసుకున్న రైతులు నామినీ మార్పునకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. పట్టాపాస్‌బుక్, ఆధార్, నామినీ ఆధార్ జిరాక్స్ కాపీలు దరఖాస్తు పత్రానికి జతచేసి అందించాలని కోరారు. నందనం, కక్కిరాలపల్లి రెవెన్యూ గ్రామాల రైతులు ఏఈఓ విశ్వభాను (9989684991), ఐనవోలు, సింగారం రెవెన్యూ గ్రామాల రైతులు ఏఈఓ హీన కౌసర్ (7989568238), గర్మిళ్లపల్లి, వెంకటాపూర్ రెవెన్యూ గ్రామాల రైతులు ఏఈఓ సీహెచ్ అనూష (9550043751), కొండపర్తి, వనమాల కనపర్తి రెవెన్యూ గ్రామాల రైతులు ఏఈఓ అఫ్రిన్(8008595569), పంథిని, పున్నేలు రెవెన్యూ గ్రామాల రైతులు ఏఈఓ సువర్ణ(8106347315)కు అందించాలని కోరారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తమన సందేహాల నివృత్తి కోసం 7288878488 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : నూతనంగా పట్టాదారు పాస్‌బుక్కులు పొందిన రైతులు రైతుబీమా పథకానికి ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఓ జాలి లక్ష్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం, దరఖాస్తుదారుని ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు జతచేసి సంబంధిత క్లస్టర్ ఏఈఓకు అందించాలని తెలిపారు. అదే విధంగా ఇదివరకు రైతుబీమాకు దరఖాస్తులు చేసుకుని, నామినీ మార్పు చేసుకునే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలోని అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోం ఈ సందర్భంగా ఏఓ కోరారు.

బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి

- ధర్నాకు దిగిన బీజేపీ ఓబీసీ నాయకులు
- ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్



కమలాపూర్ : ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



శాయంపేట : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



హన్మకొండ (పరకాల): తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో నిర్వహించిన సభలో ప్రకటించిన విధంగా బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల అరవింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శోభారాణికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో నిర్వహించిన ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు నెలల్లోపు బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ మేరకు బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా బీసీ డిక్లరేషన్ అమలు ప్రారంభించకపోతే లక్షలాది మంది బీసీలతో అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, నిరసన దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్, నాయకులు మార్క అశోక్, మాటం శ్రీనివాస్, సుభాష్, రాజు, సాంబమూర్తి, పాక కుమారస్వామి, బైరి రాజేష్, రఘుపతి, రాకేష్, రాణాప్రతాప్, రమేశ్, సందీప్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సుభాషిణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు రాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు, గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ, బీసీ సబ్ ప్లాన్, ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో పాటు అన్ని కులాలకు సమగ్ర అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థులకు ర్యాంకుతో సంబంధం లేకుండా ఫీజు రియంబర్స్‌మెంట్, బీసీ సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగిలి, రామకృష్ణ, రాజశేఖర్, చంద్రమౌళి, సంజీవరావు, సుమన్ పాల్గొన్నారు.

హన్మకొండ (పరకాల) : రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి బీసీల సంక్షేమంపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పరకాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాళీప్రసాద్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు బీసీ కులగణన చేపట్టి ఆరు నెలల్లో బీసీ కమిషన్ నివేదిక ప్రకారం బీసీ రిజర్వేషన్‌లు అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న 23 శాతం రిజర్వేషన్‌లు 42 శాతానికి పెంచుతామన్న హామీని అమలు చేయాలని అన్నారు. అదే విధంగా జ్యోతిరావుపూలే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి ఏడాదికి రూ.20వేల కోట్లు మంజూరు చేస్తామన్న హామీని కూడా నిలబెట్టుకోవాలని కోరారు. బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, మండల అధ్యక్షుడు ముష్క దేవేందర్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి రహమాన్, రుబీనా



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎల్కతుర్తి : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ రహమాన్, రుబీనా అన్నారు. వంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం భీమదేవరపల్లిలోని కస్తూర్బా పాఠశాలలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం వలన కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అపరిశుభ్రమైన, చల్లని ఆహార పదార్థాలు తీసుకోవడం వలన అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్య సూత్రలు పాటించని పక్షంలో మలేరియా, డెంగీ, డయేరియాతో పాటు జలుబు ఇతర వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించి పాటించాలని అన్నారు. వైద్య సిబ్బంది కెఎల్‌ఎస్ స్వామి, స్వరూప, పాఠశాల ప్రిన్సిపాల్ పిట్టల జ్యోతి, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పనుల్లో వేగం పెంచాలి

- ఎంపీడీఓ బాబు



మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ గుండె బాబు కమిటీ సభ్యులను ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో భోజన, మౌలిక వసతులు, పాఠశాల పరిశుభ్రతపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరైన రూ.7.50 లక్షల నిధులతో 10 రోజుల్లో పనులన్నీ పూర్తి చేయాలని కమిటీని ఆదేశించారు. పాఠశాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం వైద్యులు డాక్టర్ పద్మశ్రీ, రేణుక, ప్రత్యేకాధికారి శోభారాణితో కలిసి మండలంలోని భీంపల్లిలో పర్యటించి పలు వార్డులను పరిశీలించి పారిశుద్ధ్యంపై ఆరా తీశారు. పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించి ప్రతిరోజు గ్రామ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని ఆదేశించారు. కలుషిత నీటి ద్వారా జ్వరాలు వస్తాయని, తాగు నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించాలని ఆదేశించారు. విష జ్వరాల పట్ల గ్రామస్తులు అశ్రద్ధ వహించకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ అర్చన, ఈజీఎస్ ఏపీఓ రమేశ్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థినులు తదితరులు ఉన్నారు.

పేదలకు పక్కా ఇళ్లు నిర్మించివ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఎల్కతుర్తి: పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భీమదేవరపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చాలని అన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, గిరిజన యునివర్సిటీ, వెనుకబడిన ప్రాంతాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు అందించారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాములు, లక్ష్మణ్, రమాదేవి, తిరుపతి, మార్పు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చక్రాధర్ తదితరులు

కమలాపూర్ : భారత నాస్తిక సమాజ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అడహక్ కమిటీ సభ్యుడు గుత్తికొండ చక్రాధర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మహాసభల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో మూఢనమ్మకాలతో ప్రజలు ప్రాణ, ధన నష్టాలకు గురవుతున్నారని అన్నారు. మూఢనమ్మకాల నిర్మూలనకై, శాస్త్రీయ సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈనెల 24న హనుమకొండలోని డాక్టర్ జయగోపాల్ ప్రాంగణంలో జరిగే రాష్ట్ర మహాసభలకు యువత అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పల్లె ప్రశాంత్, నాయకులు పెర్క శ్రీనివాస్, సమత సైనిక్‌దళ్ జిల్లా ఆర్గనైజర్ మోరె రంజిత్‌కుమార్, అంబేడ్కర్ సంఘం నాయకులు రాంపురం రమేశ్, జన్ను రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మాకు రుణమాఫీ వర్తింపజేయండి'

ఐనవోలు : పంట రుణాలు చెల్లించిన రైతులకు కూడా రుణమాఫీ వర్తింపజేసి ఆ సొమ్మును రైతుల పొదుపు ఖాతాలో జమచేయాలని మండల కేంద్రానికి చెందిన ఓ రైతు ప్రభుత్వాన్ని కోరాడు. మండల కేంద్రానికి చెందిన గుడికందుల యాదయ్య 2019 సంవత్సరంలో స్థానిక బీఓబీ బ్యాంక్ బ్రాంచ్‌లో రూ. 20 వేల పంటరుణం తీసుకున్నాడు. తనకు ఉన్న భూమిలో కొంత భాగం కూతురు పేరు మీదికి మార్చాలని యాదయ్య నిశ్చయించుకున్నాడు. అయితే పంటరుణం తీసుకున్న కారణంగా బ్యాంక్ అధికారుల వద్ద పట్టాపాస్‌బుక్ ఉండటంతో కూతురుకి రిజిస్ట్రేషన్ చేయలేకపోయాడు. బ్యాంక్ అధికారులను సంప్రదిస్తే లోన్ డబ్బులు పూర్తిగా కడితేనే నోడ్యూ ఇస్తామని చెప్పడంతో లోన్ క్లియర్ చేశాడు. 2018 తర్వాతనే లోన్ తీసుకున్నానని, తన పేరు లిస్టులో రాలేదని, తనకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలని వ్యవసాయ అధికారులను కోరాడు. దీంతో ఆ రైతు ఆధార్ నంబర్ యాప్‌లో ఎంటర్ చేయగా నో డేటా ఫౌండ్ అని వస్తుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం విధించిన కటాఫ్ డేట్‌కు అనుగుణంగా పంటరుణాలు పొంది తిరిగి చెల్లించిన వారికి కూడా రుణమాఫీ వర్తింపజేయాలని పలువురు రైతు సంఘాల నాయకులు, రైతులు కోరుతున్నారు.

జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వేణుగోపాల్ గౌడ్

నయీంనగర్: ఆగస్టు 7న పంజాబ్ అమృత్‌సర్‌లో జరగనున్న 9వ జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో రిజర్వేషన్లు లేకపోవడంతోనే బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని పేర్కొన్నారు. దేశ జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్యాయం జరుగుతోందని వాపోయారు.

ఎంపీఓగా సునీల్

ఖానాపురం : మండల పంచాయతీ అధికారిగా అంబటి సునీల్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రవి బదిలీ అయిన విషయం తెలిసిందే. నర్సంపేట ఎంపీఓగా పని చేస్తూ ఖానాపురం ఎంపీఓగా బదిలీపై వచ్చారు.